

న్యూస్‌రీల్

దీపావళి సౌభాగ్యం నింపాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



అనంతగిరి: జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిరు దివ్వెలతో చీకట్లను పారదోలి వెలుగులు పంచాలని కోరుకున్నారు. పేదలు, రైతుల జీవితాల్లో కొత్తకాంతులు నింపడానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సుఖ సంతోషాలు, సిరి సంపదలు, సౌభాగ్యం, సమృద్ధిగా ఉండాలని పేర్కొన్నారు. అందరూ తగు జాగ్రత్తలు పాటిస్తూ కుటుంబ సభ్యులందరూ కలిసి పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కుల్కచర్లవాసికి గ్రూప్‌-2 నియామకపత్రం



సీఎం రేవంత్ రెడ్డి నుంచి నియామకపత్రం అందుకుంటున్న మురళీకృష్ణ

కుల్కచర్ల: గ్రూప్‌–2 నియామక ప్రక్రియలో భాగంగా కుల్కచర్ల మండలానికి చెందిన మురళీకృష్ణ నాయక్ కో–ఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రర్‌గా శనివారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పత్రాన్ని అందుకున్నారు. ఇప్పాయిపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం రోకటిగుట్టతండాకు చెందిన మురళీకృష్ణ గ్రూప్‌-2 ఫలితాల్లో సత్తాచాటి నారాయణపేట జిల్లా కోఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రర్‌గా నియమితులయ్యారు. కాగా మండలానికి చెందిన యువకుడు జిల్లా స్థాయి ఉద్యోగాన్ని పొందడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజన్‌లో సాంకేతిక లోపం

రెండు గంటలు నిలిచిన ప్యాసింజర్ రైలు



తాండూర్ స్టేషన్‌లో ఆగిన రైలు

తాండూరు టౌన్: సాంకేతిక లోపం వలన ఓ ప్యాసింజర్ రైలు తాండూరు రైల్వే స్టేషన్‌లో రెండు గంటల పాటు నిలిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. వాడి నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లాల్సిన వాడి ప్యాసింజర్ రైలు.. ఆదివారం సాయంత్రం 4 గంటలకు తాండూరుకు చేరుకుంది. తిరిగి వెళ్లే క్రమంలో మొరాయించింది. ఇంజన్‌లో సాంకేతిక లోపం ఉన్నట్లు లోకో పైలట్ గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా.. మెకానిక్‌లు వచ్చినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అక్కడికి వచ్చిన ఓ గూడ్స్ ఇంజన్‌ను ప్యాసింజర్ బోగీలకు అమర్చి, రైలును సికింద్రాబాద్‌కు తరలించారు. దీంతో రెండు గంటల పాటు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

టోల్‌ప్లాజా వద్ద రద్దీ

షాద్‌నగర్: దీపావళి పండుగ సందర్భంగా చాలామంది సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్‌-బెంగళూరు 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ప్రయాణికుల సంఖ్య పెరిగింది. షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ శివారులో ఉన్న జడ్చర్ల ఎక్స్‌ప్రెక్స్ వే టోల్‌ప్లాజా వాహనాలతో రద్దీగా మారింది.

పార్టీ బలోపేతమే లక్ష్యం

ఏఐసీసీ పరిశీలకుడు రాబర్ట్ బ్రూస్



సమావేశంలో మాట్లాడుతున్న రాబర్ట్ బ్రూస్

తుర్కయంజాల్: పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకుడు, తిరునల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ అన్నారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తుర్కయంజాల్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆయన సమక్షంలోనే ఎమ్మెల్యే రంగారెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పాల్గొన్నారు.



పూలు, గుమ్మడికాయల విక్రయాలు



వికారాబాద్‌లో వెలిసిన టపాసుల దుకాణాలు



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దీపావళి శోభ

ఊరూరా దీపావళి శోభ సంతరించుకుంది. వికారాబాద్ పట్టణంలో లక్ష్మి పూజలు చేసేందుకు వ్యాపారస్తులు, సామాన్యులు సన్నద్ధం అయ్యారు. మార్కెట్‌లో రకరకాల బొమ్మలు, ప్రమిదలను కొనుగోలు చేస్తుండటంతో సందడిగా మారింది. చుట్టు పక్కల ప్రాంతాల రైతులు తమ పొలాల్లో పండించిన పూలను వికారాబాద్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పండగ వేళ పూలకు భలే గిరాకీ ఉంది. స్వీట్ హౌస్‌లో స్పెషల్ స్వీట్లు తయారు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. పట్టణంలోని చిగుళ్లపల్లి మైదానంలో 30 వరకు టపాసుల దుకాణాలు వెలిశాయి. చిన్నా పెద్ద అందరూ వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అలాగే తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో సైతం పండగకు సిద్ధం అయ్యారు.

– అనంతగిరి

ఖజానాకు కిక్

మద్యం టెండర్లకు గడువు పొడిగింపు



- చివర్లో దరఖాస్తుల వెల్లువ
- 23 వరకు అర్జీకి అవకాశం
- మరింతగా సమకూరనున్న ఆదాయం

వికారాబాద్: మద్యం దుకాణాల విషయంలో అంచనాలు తలకిందులయ్యాయి. గతేడాది నష్టాలొచ్చాయనే ప్రచారంతో ప్రస్తుతం దరఖాస్తులు వేసేందుకు మొదట్లో మొగ్గు చూపలేదు. కానీ చివరకు ఊహించిన దానికంటే అధికంగా అర్జీలు వచ్చిపడ్డాయి. ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం విషయంలో దాదాపు గత సీజన్ లక్ష్యం అధిగమించింది. 2021 ఏడాదితో పోలిస్తే 2023లో మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య బాగా పెరిగింది. గత మద్యం పాలసీనే ప్రస్తుతం యథాతథంగా ప్రభుత్వం అమలు చేయగా దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచారు. మొదట్లో మందకొడిగా దరఖాస్తులు రాగా చివరి రెండు రోజుల్లో వెయ్యికి పైగా అర్జీలు వచ్చిపడ్డాయి. ఈ నెల 23వ తేదీ వరకు అర్జీల గడువు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మరింతగా ఆదాయం వచ్చిపడే అవకాశం ఉంది. జిల్లాల 16వ తేదీ వరకు కేవలం 450 దరఖాస్తులు మాత్రమే రాగా చివరి రెండు రోజులు శుక్ర, శనివారాల్లో 1,200 దరఖాస్తులొచ్చాయి.

మొత్తం దరఖాస్తులు 1,750

జిల్లాలో మొత్తం 59 మద్యం దుకాణాలు ఉండగా వ్యాపారుల నుంచి మొత్తం 1,750 దరఖాస్తులు వచ్చాయి. గతేడాదిలాగే యథాతథంగా రిజర్వేషన్లు అమలు చేయగా రిజర్వ్ షాపులకు దరఖాస్తులు తక్కువగా వస్తాయని భావించారు. కానీ ఆ అంచనాలు తప్పని తేలింది. 2021లో 923 దరఖాస్తులు రాగా 2023లో 2,637 అర్జీలు వచ్చాయి. ఈసారి దరఖాస్తుల సంఖ్య తగ్గినప్పటికీ రూ.24 లక్షల ఫీజుతో ఖజానాకు గత పాలసీలో వచ్చిన ఆదాయానికి సమానంగా ఉంది. మరో నాలుగు రోజులు గడువు పెంచిన నేపథ్యంలో గతేడాది మరింత ఆదాయం పెరిగే అవకాశం లేకపోలేదు. 2021లో దరఖాస్తుల రూపంలో రూ.18.46 కోట్ల ఆదాయం రాగా 2023 రూ.52.74 కోట్లు వచ్చి పడ్డాయి. ఈ ఏడాది ఇప్పటివరకు దరఖాస్తుల ద్వారా 52.50 కోట్ల ఆదాయం జమ అయింది.

పుట్టుకొచ్చిన కొత్త సిండికేట్లు

మద్యం వ్యాపారులు ఎక్కువ శాతం వ్యక్తిగతంగా కంటే సిండికేట్‌గా మారి అర్జీ వేయడానికే మొగ్గు చూపారు. ఇందులో చాలా చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి కుటుంబసభ్యుల పేరున వేశారు. జిల్లాలో మద్యం షాపులకు అర్జీలు వేసిన వారిలో ఈ ఏడాది మహిళలు సైతం బాగానే ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువ శాతం వారి భార్యల పేరున టెండర్లు వేశారు. ఉపాధ్యాయులు, మాజీ ప్రజా ప్రతినిధులు సైతం ఎక్కువగా మద్యం టెండర్లలో పాల్గొన్నారు. జిల్లాలో 15 నుంచి 20 మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాలు జోరుగా ఉండటంతో ఆ షాపులకు పోటీ పడ్డారు. ఏడాది నవాబుపేటలో ఓ షాపునకు ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. కొడగంల్, తాండూరు, ఏరియాలో మద్యం విక్రయాలు బాగానే ఉన్నప్పటికీ కొన్ని షాపులకు దరఖాస్తులు తక్కువగా రావటం అనుమానాలకు తావిస్తుంది.

మద్యం టెండర్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలు

సర్కిల్‌పేరు	షాపుల సంఖ్య	2023	ప్రస్తుతం
వికారాబాద్	15	832	470
పరిగి	12	555	422
తాండూరు	18	552	438
మోమిన్‌పేట్	06	334	181
కొడంగల్	08	262	193



స్థల పరిశీలనలో భారత పశువైద్య మండలి, రెవెన్యూ అధికారులు

అభివృద్ధి వైపు అడుగులు

- పశువైద్య కళాశాలకు స్థల పరిశీలన
- సందర్శించిన భారత పశువైద్య మండలి అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న దుద్యాల్‌వాసులు

దుద్యాల్: రాష్ట్ర ప్రభుత్వం దుద్యాల్ మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే పశు వైద్య కళాశాలను మంజూరు చేసింది. కళాశాల భవన నిర్మాణం కోసం పశువైద్య అధికారులు రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇటీవల మండల పరిధిలోని హకీంపేట్ శివారులో స్థల పరిశీలన సైతం చేశారు. పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం రైతుల నుంచి సేకరించిన 1,270 ఎకరాల భూమిలో 252 సర్వే నంబర్‌లో 250 ఎకరాలను ఎడ్యుకేషన్ హబ్ కోసం కేటాయించారు. అందులో పశువైద్య కళాశాల ఏర్పాటుకు దాదాపు 45 ఎకరాల భూమి అవసరమని భారత పశువైద్య మండలి అధికారులు సూచించినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.360 కోట్లను కేటాయించిందని, మొదటి విడతలో రూ.200 కోట్లను మంజూరు చేసినట్లు సమాచారం.

హకీంపేట్‌లో 45 ఎకరాలు కేటాయింపు

దుద్యాల్ మండల ఏర్పాటు తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతుంది. మండల పరిధిలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్లకుంట తండా గ్రామాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రభుత్వం దాదాపు 1,270 ఎకరాల భూమిని సేకరించింది. త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. మండల కేంద్రంలో సమీకృత మండల కార్యాలయాలు, ధాన్యం నిల్వల కోసం గోదాం ఏర్పాటు, హకీంపేట్లో మండల సమీకృత విద్యాలయాలు, ఏటీసీ సెంటర్, ఇంటర్ కళాశాల వంటివి కేటాయించారు. అందుకు సంబంధించిన పనుల సైతం వేగంగా జరుగుతున్నాయి. తాజాగా పశువైద్య కళాశాలను కేటాయించడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పండగ పూట.. పేకాట!

- జూదరులుగా వ్యాపారులు, రాజకీయ నేతలు
- తాండూరు సెగ్మెంట్‌లో జోరుగా పత్తాలాట
- రూ.లక్షల్లో కొనసాగుతున్న వ్యవహారం
- పట్టించుకోని పోలీస్ యంత్రాంగం



బషీరాబాద్: జూదానికి వ్యసనమై ఎంతో మంది జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. మూడు ముక్కలాటలో కొందరు సర్వం కోల్పోయి కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. దీపావళి సందర్భంగా తాండూరు నియోజకవర్గంలో పేకాట ఆడడం ఆనవాయితీగా మారింది. జూదాన్ని అరికట్టాల్సిన పోలీసులు పేకాటరాయుళ్ల ముడుపులకు అలవాటుపడి అటువైపు కూడా కన్నెత్తి చూడడంలేదనే విమర్శలు బహిరంగా వినిపిస్తున్నాయి. వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు మొదలుకొని కార్మికుల వరకు కార్డ్స్ ఆడడం అలవాటుగా మారింది. దీంతో తాండూరులో మూడు ముక్కలు.. అరవై ఆటలుగా పేకాట నడుస్తోంది.

ఏళ్ల నుంచి ఆచారం

జిల్లాలో తాండూరు వాణిజ్య కేంద్రంగా పేరొందింది. ఇక్కడ నాపరాతి, సుద్ద గనుల వంటి విలువైన ఖనిజ సంపద విరివిగా ఉండడంతో వ్యాపారాలు, ఉపాధి ఎక్కువ లభిస్తుంటాయి. అందుకే ఈ ప్రాంతాన్ని మినీ దుబాయ్ అని కూడా పిలుస్తుంటారు. దీపావళి సందర్భంగా వ్యాపారులు తమ షాపుల్లో లక్ష్మీ పూజతో పాటు రాత్రి తప్పనిసరిగా పేకాట ఆడటం సంవత్సరాల నుంచి ఆచారంగా కొనసాగుతూ వస్తోంది.

శిబిరాల ఏర్పాటు

వ్యాపారులు కొంతమంది సిండికేట్‌గా మారి తమ షాపులు, ఇళ్లలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసుకొని పందేలు కాస్తూ పేకాట కొనసాగిస్తున్నారు. పట్టణంలోని గంజి అర్తుల్లో పూజల అనంతరం పేకాట ఆడడం నిబంధనగా పెట్టుకున్నారు. మరికొందరు ఫంక్షన్ హాళ్లలోని గదుల్లో, లాడ్జీల్లో, పట్టణ శివారు ప్రాంతల్లోని ఫామ్‌హౌస్‌ల్లో, పాలిషింగ్ యూనిట్లలో, పొలాల బావుల దగ్గర తీన్‌పత్తా ఆట జోరుగా సాగిస్తున్నారు. ఇవీ అసాంఘిక కార్యక్రమాలని తెలిసిన వాళ్లు కూడా ఇందులో పాల్గొనడం గమనార్హం. పండుగ 15 రోజుల్లోనే రూ.లక్షల్లో డబ్బులు చేతులు మారుతున్నాయి.

ముడుపుల ఆరోపణలు

ఈ వ్యవహారంలో ఎక్కువగా బడాబాబులే ఉండడంతో పోలీసులు దాడులు చేయడానికి జంకుతున్నారు. 5 ఏళ్లుగా తాండూరు పట్టణంతో పాటు మండలాల్లోనూ ఎక్కడ పోలీసుల దాడులు చేయలేదు. పేకాటరాయుళ్లు పోలీసులకు ముడుపుల మేత వేసి దర్జాగా ఆడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది తాండూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలో ఎక్కడ కూడా దాడులు జరపవద్దని ఓ పోలీసు అధికారి వాట్సాప్ కాన్ఫరెన్స్ కాల్‌లో ఆదేశాలు ఇచ్చారని అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. పేకాట రాయుళ్ల నుంచి రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెప్పడంతో కనీసం రాత్రివేళ పోలీసు జీపుల సైరన్ కూడా వినిపించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

స్పెషల్ డ్రైవ్ చేస్తాం

దీపావళి పూజల్లో పేకాట ఆడుతుంటారని మా దృష్టికి వచ్చింది. బెట్టింగులు కట్టి పేకాట ఆడడం చట్ట విరుద్ధం. పట్టణంతో పాటు మండలాల్లో ఎక్కడ జూదం ఆడిన పోలీసులకు సమాచారం ఇవ్వండి. ప్రత్యేక పోలీసు బృందాలతో దాడులు నిర్వహిస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

– బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ, తాండూరు

నేడు సదర్ సమ్మేళనాలు

మణికొండ: దీపావళి పండగను పురస్కరించుకుని యాదవులు నిర్వహించే సదర్ వేడుకలకు నార్సింగి, కోకాపేట సిద్ధమయ్యాయి. నార్సింగి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, కోకాపేట గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించే ఉత్సవాలకు వివిధ ప్రాంతాలకు చెందిన దున్నపోతులను రప్పించి వాటితో విన్యాసాలు చేయిస్తారు. వాటికి పూజలు నిర్వహించడంతో పాటు ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వాటికి బహుమతులను అందజేస్తారు. యాదవులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యాదవ సంఘాల నాయకులు కోరా రు. నార్సింగిలో ఉత్సవాలకు జాతీయ చాంపియన్‌ను 8 సార్లు సాధించిన దున్నపోతు పాల్గొంటుందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా పథ సంచలన్



స్వయం సేవకుల కవాతు

చేవెళ్ల: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం పథసంచలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వయం సేవకులు చేవెళ్లలోని రచ్చబండ నుంచి పురవీధుల మీదుగా కేవీఆర్ గ్రౌండ్ వరకు కవాతు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. హిందూ సమాజాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గ్రామగ్రామాన స్వయం సేవక్ సంఘ్‌ను విస్తరించాలని, దేశాభివృద్ధే లక్ష్యంగా పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఆర్‌ఎస్ఎస్ చేవెళ్ల సంఘ్ చాలక్ బిల్లపాటి కృష్ణారెడ్డి, మైపాల్‌రెడ్డి, మల్లేశ్, కె.వెంకట్‌రెడ్డి, సురేందర్, సాయిరాం, బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, డాక్టర్ వైభవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, పాండురంగారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ధారూరు: మండల పరిధి అంతారం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. జూదం ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.6,340 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, నిందితులను ఠాణాకు తరలించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్‌పాష, సిబ్బంది పాల్గొన్నారని ధారూరు ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి


జహంగీర్ మృతదేహం

చేవెళ్ల: వాహనంలో కొత్తిమీర లోడ్ చేసి, కవర్ కప్పుతుండగా.. పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బస్తేపూర్ గ్రామంలో చోటు చేసు కుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా పులుసు మామిడి గ్రామానికి చెందిన మహమ్మద్ జహంగీర్(26), చేవెళ్లలో బోలెరో డ్రైవర్ జహంగీర్ వద్ద క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటి లాగే శనివారం రాత్రి బస్తేపూర్‌లో కొత్తిమీర లోడ్ కోసం వెళ్లారు. పొలం సమీపంలోని విద్యుత్ తీగల కింద వాహనం ఆపారు. లోడ్ అనంతరం వాహనం పైకి ఎక్కి.. కవర్ కప్పుతున్న క్రమంలో పైన ఉన్న కరెంట్ తీగలు చేతికి తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే డ్రైవర్.. బాధితున్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి యూసుప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

26న పాషనరహరి వర్ధంతి సభ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ఈ నెల 26న నిర్వహించే కామ్రేడ్స్ మహబూబ్ పాష, నరహరి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. సీపీఎం కమిటీ జిల్లా ముఖ్యనేతల సమావేశం ఆదివారం పట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూములను పేదలకు పంచాలని, కూలీ రేట్లు పెంచాలని, అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం పోరాడిన పాషనరహరిలను హతమార్చిన విషయాన్ని గుర్తు చేశారు. వారి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాంచందర్, సామేల్, చంద్రమోహన్, జగన్, నర్సింహ్మా, బుగ్గరాములు, జంగయ్య, అంజయ్య, రుద్రకుమార్‌లు పాల్గొన్నారు.

గ్లూకోజ్ కారణంగానే చనిపోయింది..

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వివరించిన మానస కుటుంబీకులు

మంచాల: గ్లూకోజ్ కారణంగానే గర్భిణి మానస చనిపోయిందని మృతురాలి కుటుంబీకులు ఆరోపించారు. వైద్య చికిత్స కోసం శుక్రవారం భర్త మధుతో కలిసి మానస స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు రాగా.. ఆమెకు గ్లూకోజ్ ఎక్కిస్తున్న క్రమంలో మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇదే విషయమై న్యాయం కోసం.. బాధిత కుటుంబం ఆదివారం నగరంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె చనిపోయిందని, మృతురాలికి చిన్న బాబు ఉన్నాడని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీనిచ్చారు. కలెక్టర్, ఆర్డీఓతో మాట్లాడి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం, ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు, భర్త మధుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగం, బాలుడి చదువుకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సదానందం, ప్రవీణ్, బూర కృష్ణ, విష్ణు వర్ధన్‌రెడ్డి, ప్రభాకర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న డీసీఎం

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి డీసీఎం వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం పస్నూర్ గ్రామానికి చెందిన చిత్తలూరి వెంకన్న కుమారుడు చిత్తలూరి గణేశ్(23), నాలుగు నెలలుగా ఎల్బీనగర్‌లోని దుర్గా ఫైర్ వర్క్స్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాణసంచా లోడ్‌ను శనివారం రాత్రి ఘట్‌కేసర్‌లో అన్‌లోడ్ చేశారు. అనంతరం మహేశ్వరం నుంచి గోదాం వద్ద ఔటర్‌రింగ్ రోడ్డు మీదుగా వెళ్తుండగా ఆదివారం తెల్లవారు జామున ఎగ్జిట్ నం.10 వద్ద, ఎలాంటి సిగ్నల్ లేకుండా రోడ్డుపై నిలిపి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో గణేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సందీప్, సతీష్‌లు గాయాపడ్డారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు.. దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆనంద రవళి దీపావళి

ధనలక్ష్మీ పూజలు, నోములు, వ్రతాలతో సందడి

- కొనుగోలు దారులతో బాణసంచా, పూజాసామగ్రి దుకాణాల కిటకిట


పరిగి: బాణసంచా విక్రయ దుకాణం

పరిగి: దీపావళి పర్వదినానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. చీకటిని పారదోలుతూ వెలుగును తెచ్చే పండుగా, విజయానికి ప్రతీకగా జరుపుకొంటారు. చెడుపై గెలుపునకు సంకేతంగా ఇంటిల్లిపాది.. ధనలక్ష్మికి ఆహ్వానం పలుకుతూ.. కాంతులు వెలిగిస్తారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. దీనిని దివాలి అనికూడా పిలుస్తారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ఇళ్లు, దుకాణాల్లో దీపాలు, కొవ్వొత్తులను వెలిగించి సంపద, అదృష్టం, శ్రేయస్సుకు ప్రతీక అయిన లక్ష్మీదేవిని పూజిస్తారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు టపాసులు కాల్చుతూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొడతారు.

పర్యావరణ పరిరక్షణ

పండుగ వేళ, పర్యావరణ పరిరక్షణకు టపాకాయలు వాయు, ధ్వని కాలుష్యాన్ని పెంచేవిధంగా ఉన్నాయనే కోణంలో కొన్నిటిని నిషేధించారు. బాణసంచా కాల్చినప్పుడు సాధారణం కంటే కాలుష్యం కొన్ని వందల రేట్లు అధికంగా విడుదలవుతుంది. వీటిని కాల్చేవారికి కాకుండా చుట్టూ ఉన్నవారికి ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు. పొగ ఎక్కువ వ్యాపించి, ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తూ.. టపాసులను కాల్చాలని సూచిస్తున్నారు. గతంలో అత్యున్నత న్యాయస్థానం కాలుష్య నివారణకు ఆంక్షలు విధించింది. కాలుష్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో టపాసులను నిషేధించింది. సాధారణ కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో ఆంక్షలు విధించింది.

ప్రమాదాల నివారణకు..

టపాసులు కాల్చే ముందు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. దుస్తులపై నిప్పురవ్వలు పడితే త్వరగా ప్రభావం చూపకుండా కాటన్ దుస్తులు ధరించాలి. పిల్లలను గమనిస్తుండాలి. బాణసంచా పేల్చేటప్పుడు చెవుల్లో దూది పెట్టుకోవడం మరిచిపోవద్దు. సీమ టపాసులను కొంచెం దూరంగా ఉంచి కాల్చడం మంచిది. పిల్లల చేతికి రాకెట్, తారాజువ్వ తరహా టపాసులు ఇవ్వవద్దు. రాకెట్‌లాంటివి పూరిళ్లకు దూరంగా విశాలమైన ఆవరణలోనే కాల్చాలి. కాలని వాటిని నీటిలో లేదా ఇసుక బకెట్‌లో వేయాలి. భూచక్రాలు కాల్చేటప్పుడు పాదరక్షలు ధరించడం మంచిది. సామగ్రికి సమీపంలో కొవ్వత్తులు ఉంచరాదు.

దీపం కళాత్మక రూపం

ఆకట్టుకుంటున్న ప్రమిదలు

దుద్యాల్: దివ్వెల పండుగ నేపథ్యంలో ప్రజల అభిరుచికి తగ్గట్లుగా మార్కెట్లో ప్రమిదలు లభ్యమవుతున్నాయి. సాధారణ ప్రమిదలతో పాటు.. కాలానుగుణంగా కళాత్మకమైనవి అందుబాటులో ఉన్నాయి. వాటిని కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. కాగా.. విపణిలో లభించే దీపాంతాల ఆకృతి నచ్చని నేపథ్యంలో కొందరు ఆన్‌లైన్‌లో సర్చ్ చేస్తున్నారు. సరికొత్త వాటిని కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్నారు.



పండగ పూట.. భద్రం సుమా!


అమ్మకానికి సిద్ధంగా టపాసులు

- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- వ్యాధిగ్రస్తులు దూరంగా ఉండడం మంచిది

దుద్యాల్: దీపావళి వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో సందడి మామూలుగా ఉండదు. చిన్నపిల్లలు ఉంటే మరీ ఎక్కువే ఉంటుంది. ఉదయం నుంచి లక్ష్మీ పూజలు చేసుకోవడం, సాయంత్రం బాణసంచా కాల్చడం సర్వసాధారణంగా జరుగుతుంటాయి. అయితే టపాసులతో పర్యావరణానికి విఘాతం కలిగే అవకాశం లేకపోలేదు. మరోవైపు బాణసంచా కాల్చేటప్పుడు కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు.

కాలుష్య ప్రభావం

బాణసంచా కాల్చడంతో వాటి నుంచి వెలువడే పొగ వాతావరణంలో సుమారు మూడు రోజుల వరకు ఉంటుంది. అలాంటి గాలిని పీల్చినప్పుడు శ్వాసకోస వ్యాధులు సంభవించే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. టపాకాయల్లో ఉండే టాక్సిక్ అనే కారకంతో పాటు రాగి, కాడ్మియం, పోటాషియం వంటి పదార్థాలు విఘాతం కలిగిస్తాయి. వీటితో ఆస్తమాతో పాటు ఇతర రుగ్మతలు వస్తాయి. టపాసులు కాల్చేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కళ్లకు ముప్పు తప్పదని కంటి వైద్యులు హెచ్చరిస్తున్నారు. 70–80 శాతం ప్రమాదాల్లో 10–18 సంవత్సరాల వారే ఉంటున్నారు. జాగ్రత్తలు పాటించడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

ఇవి పాటించాలి

- టపాసులు కాల్చేటప్పుడే కాటన్ దుస్తులే ధరించాలి.
- చిన్న పిల్లలు పెద్దల సమక్షంలోనే కాల్చాలి.
- సగం కాల్చిన, కాలని టపాసులను నీళ్లు, ఇసుకలో వేయాలి.
- రాకెట్స్ ఇతర టపాసులను గుడిసెలు, పెట్రోల్ బంకుల వద్ద కాల్చకూడదు.
- టపాసులు కాల్చుతున్న ప్రదేశంలో నీరును అందుబాటులో ఉంచుకోవాలి.
- వాయువులు కళ్లలోకి వెళ్తే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే కంటి వైద్యులను సంప్రదించాలి.
- టపాసులు కాల్చుతున్నప్పుడు శబ్దాలకు చెవిలో దూది పెట్టుకోవడం మేలు.
- ఆస్తమా, అలర్జీలు ఉంటే మరింత జాగ్రత్తగా ఉండాలి. దురద, తుమ్ములు, ఆయాసం పెరుగుతాయి. ఇవి రాకుండా ముక్కు దగ్గర తడి వస్త్రం కట్టుకోవాలి.
- కళ్లకు అద్దాలు పెట్టుకుంటే ఎలాంటి హాని జరుగదు.

శబ్దంతో ప్రమాదం



టపాసులను పేల్చడం ప్రమాకరమే. మానవుడు సాధారణంగా 120 డేసిబెల్స్ వరకు శబ్దం వినవచ్చు. అంతకంటే ఎక్కువ ఉంటే చెవిలో నొప్పి ప్రారంభమై రక్తం కారుతుంది. చెవిలో దుది పెట్టుకొని బాణసంచా కాల్చాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం తప్పదు.

– వందన, వైద్యురాలు, పీహెచ్‌సీ హకీంపేట్

పాడి రైతుల శ్రేయస్సే లక్ష్యం


రైతులకు పాలక్యాన్లు పంపిణీ చేస్తున్న డెయిరీ మేనేజర్

కడ్తాల్: పాడి రైతుల శ్రేయస్సే విజయడెయిరీ లక్ష్యం అని పాలశీతలీకరణ కేంద్రం మెనేజర్ ప్రాణేశ్‌కుమార్, స్థానిక విజయ పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పాల సేకరణ కేంద్రం వద్ద 120 మంది రైతులకు దీపావళి కానుకగా పాలక్యాన్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాల ఉత్పత్తి మరింత పెరగాలని, నాణ్యమైన పాలను పోసి అధిక ధర పొందాలని సూచించారు. రైతులకు అవసరమైన సదుపాయాలను ఎప్పటికప్పుడు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. సకాలంలో పాలబిల్లులు చెల్లించాలని, పశుగ్రాసం, దాణా పంపిణీ చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు రాములు, రవీందర్‌రెడ్డి, వెంకట్ రాములుగౌడ్, వెంకట్‌రెడ్డి, పాండు, మహేశ్, జంగారెడ్డి, సత్యం, రాములు, చంద్రయ్య, యాదయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కలం తీసుకో.. రాత మార్చుకో

బాలాజీ సన్నిధిలో పెన్నుల పంపిణీ

మొయినాబాద్: బ్రహ్మదేవుడు ఎవరి తలరాత ఎలా రాస్తాడో ఎవరికీ తెలియదు.. కానీ చిలుకూరు బాలాజీ సన్నిధిలో పెన్ను తీసుకుని నీ తలరాతను నువ్వే మార్చుకో అని అంటున్నారు అర్చకుడు సురేశ్‌స్వామి. ఆదివారం ఆయన ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో స్వామివారి దర్శనం అనంతరం పిల్లలకు పెన్నులు కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవ దర్శనానికి వచ్చిన చిన్నారులకు స్వామివారి ప్రసాదంగా పెన్నులు అందజేస్తే.. వారికి విశ్వాసం పెరిగి, చదువుపై మమకారం పెరుగుతుందని, అందుకే కొంత కాలంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాని తెలిపారు. ఆలయాల్లో బాలబాలికలకు ప్రాధాన్యత పెరగాలని.. దేశ భవిష్యత్‌కు వారే నిర్మాతలవుతారని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు.


చిన్నారులకు పెన్నులు అందజేస్తున్న అర్చకుడు సురేశ్‌స్వామి

కడ్తాల్ తహసీల్దార్‌గా జయశ్రీ



కడ్తాల్: నూతన తహసీల్దార్‌గా జయశ్రీ నియామకమయ్యారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కడ్తాల్‌లో రెండేళ్లుగా పనిచేసిన షేక్ ముంతాజ్.. డీఏఓగా చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సైదాబాద్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయశ్రీ ఇక్కడికి వచ్చారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


వెంకటయ్య (ఫైల్)

కుల్కచర్ల: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం మల్లెపల్లి గ్రామానికి చెందిన దొడ్ల వెంకటయ్య(42), శనివారం కుల్కచర్ల గ్రామంలో ఓ వేడుకకు హాజరై.. రాత్రి పది గంటలకు గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో.. అతను నడిపిస్తున్న టీవీఎస్ ఎక్సెల్.. రైతువేదిక సమీపంలో అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అక్కడ ఉన్న రాళ్లు సదరు వ్యక్తికి బలంగా తాకి, తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం వరకు అతన్ని ఎవరూ చూడకపోవడంతో తీవ్రరక్తస్రావం జరిగి మృత్యువాత పడ్డాడు. దీనిని గమనించిన కొందరు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న వారు.. కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బైక్ ఢీ కొని మరొకరు..

షాద్‌నగర్‌రూరల్: ద్విచక్రవాహనం ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పోచమ్మ దేవాలయం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ప్యారడైజ్ కాలనీ వాసి జెట్టిరమణయ్య(45), శనివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి ఓ బైక్.. రమణయ్యను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనదారుడు పరారీలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కష్టపడ్డారు.. ఉన్నతికి చేరుకున్నారు


నియామక పత్రంతో దేవేందర్ నాయక్, కుటుంబీకులు

- గ్రూప్–2లో మెరిసిన ఉద్యోగులు
- జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ.. డీటీకి ఎంపికైన దేవేందర్
- కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ.. ఏఎస్‌ఓగా ఉమ

మహేశ్వరం/కొత్తూరు: ప్రభుత్వ వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తూనే.. మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని కలగన్నారు. కష్టపడ్డారు. ఫలితం దక్కించుకున్నారు. వారిలో ఒకరు జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ.. డీటీకి ఎంపికగా, మరో ఇద్దరు కానిస్టేబుల్‌గా పనిచేస్తూ.. ఏఎస్‌ఓగా ఒకరు, ఎస్‌ఐగా మరొకరు ఎంపికయ్యారు. నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తదితర అధికారుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకొన్నారు.

పేద రైతు కుటుంబంలో..

పేద రైతు కుటుంబంలో పుట్టి, ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. గ్రూప్– 2లో రాష్ట్ర స్థాయిలో 171 ర్యాంకు సాధించి, డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించాడు గిరిజన బిడ్డ దేవేందర్. మండల పరిధి పెద్దమ్మ తండా అనుబంధ నల్లచెర్వుతండాకు చెందిన కాట్రావత్ లక్ష్మీ– రాములు నాయక్ దంపతుల కుమారుడు దేవేందర్ నాయక్ శనివారం రెవెన్యూ అధికారుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. వికారాబాద్ జిల్లాలో రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యాడు. ఇంతకు ముందే.. దేవేందర్ గ్రూప్–3లో 305 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 63వ ర్యాంకు సాధించారు. గ్రూప్– 4లో 141వ ర్యాంకు సాధించి, శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్– 1లో 433 మార్కులు సాధించినప్పటికీ.. కొద్దిపాటి తేడాతో అదృష్టం చేజారింది. అయినా నిరుత్సాహం చెందకుండా.. డీటీ కొలువు సాధించాడు.

కానిస్టేబుల్‌గా కొనసాగుతూ..


ఉమ

కొత్తూరు: కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూనే గ్రూప్–2లో ఉత్తమ ర్యాంకు సాధించి, సెక్రటేరియట్‌లో ఏఎస్‌ఓగా ఉన్నతస్థితికి చేరుకుంది. పట్టణానికి చెందిన గాలిగాని యాదయ్య మూడో కూతురు ఉమ.. చిన్నప్పటి నుంచి చదువుల్లో మేటి. సర్కారు బడుల్లో విద్యనభ్యసించి గ్రూప్– 1, ఎస్ఐ, ఉద్యోగానికి పలుమార్లు పరీక్షలు రాసి కొద్దిపాటి మార్కులతో రాణించలేక పోయింది. ఆ తరువాత కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. అయినప్పటికీ.. పట్టువదలక.. పోటీ పరీక్షలు రాసి.. గ్రూప్–2లో మెరిసింది. ప్రస్తుతం ఉమ కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది.

కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా..


ప్రవళిక

యాచారం: ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ.. ప్రస్తుతం అదే శాఖలో ఎస్ఐగా ఉన్నతికి చేరుకుంది మండల పరిధి నందివనపర్తి అనుబంధ గ్రామం పిల్లిపల్లికి చెందిన అయ్యాగాని ప్రవళిక. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె.. బీఫార్మసి పూర్తి చేసింది. తాజాగా వెలువడిన గ్రూపు– 2లో రాణించి, ఎస్ఐగా ఎంపికైంది. గతంలో గ్రూప్– 4లో వార్డు ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రూప్– 1లో ఉద్యోగం సాధించడమే లక్ష్యమని పేర్కొంది. ప్రవళిక తల్లిదండ్రులు పాండు, శోభలు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

ఎంపీడీఓగా పరిమితగౌడ్

ఇబ్రహీంపట్నం: మధ్య తరగతి కుటుంబానికి చెందిన పరిమితగౌడ్ గ్రూప్– 2 ఫలితాల్లో ఎంపీడీఓ ఉద్యోగాన్ని సాధించింది. చిన్న వయసులోనే గెజిటెడ్ కొలువు దక్కించుకోవడంతో పలువురు అభినందనలు తెలిపారు. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె.. తల్లిదండ్రులకు శాలువా కప్పి, మిఠాయి తినిపించారు. కృతజ్ఞతలు తెలిపారు.


తల్లిదండ్రులకు మిఠాయి తినిపిస్తున్న పరిమిత

అనంతగిరికి పర్యాటకుల తాకిడి

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరిగుట్టకు ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సెలవులు ఉండటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చారు. ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం సమీపంలోని అడవులె వ్యూ పాయింట్ వద్ద విహరిస్తూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రయాణికురాలికి బ్యాగు అప్పగింత

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆదివారం ఉదయం ఓ మహిళా ప్రయాణికురాలు బంగారం, నగదుతో కూడిన బ్యాగును పోగొట్టుకున్నది. అందులో రూ.లక్ష , రెండున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు పాస్‌పోర్టు, ఐఫోన్, యూఏఈలో ఉపాధికి సంబంధించిన పత్రాలున్నాయని స్థిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించి బ్యాగును గుర్తించి ప్రయాణికురాలికి అందజేసినట్లు సీఐ కనకయ్య తెలిపారు. పోలీసుల తక్షణ స్పందనపై ప్రయాణికురాలు ఆనందం వ్యక్తం చేసింది.

కార్మికులకు దుస్తుల అందజేత

మణికొండ: వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన కాలనీలో వాచ్‌మెన్లు, పని మనుషులు, మున్సిపల్ కార్మికులకు ఆర్థిక సాయంతో పాటు దుస్తులు అందించారు. నక్షత్ర గేటెడ్ కమ్యూనిటీలో జరిగిన కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు డి. సీతారాం, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వి.బాల్‌రెడ్డి హాజరై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు కె. ధన్‌రాజ్, జి.నరేందర్, ఎ.లక్ష్మన్‌రావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నిధులు రాక.. నిర్మాణం సాగక

- అసంపూర్తిగా గిరిజన భవనం
- పట్టించుకోని పాలకులు, అధికార యంత్రాంగం


గిరిజన భవనం

ఆమనగల్లు: గిరిజనుల కోరిక మేరకు.. సంయుక్తంగా సభలు, సమావేశాలు, పండుగలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం గిరిజన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకు కావాల్సిన నిధులు కేటాయించింది. అనంతరం నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ.. అవి నిలిచిపోయాయి.

30 గుంటల భూమి

గిరిజన సంఘాల విన్నపంతో 2023లో కల్వకుర్తి నాటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆమనగల్లు పట్టణ సమీపంలోని కల్వకుర్తి రోడ్డులో గిరిజన భవన నిర్మాణానికి 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అక్కడ గిరిజనులు సేవాలాల్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం రూ.2 కోట్లు మంజూరు చేయించారు. దీంతో అదే ఏడాది జూన్ 17న అప్పటి కలెక్టర్ హరీశ్‌తో కలిసి.. జైపాల్ యాదవ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే నిధులు కేటాయించినప్పటికీ.. టెండర్ ప్రక్రియ చేపట్టకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

2024లో పనులు షురూ

ప్రస్తుత ప్రభుత్వం 2024లో భవన నిర్మాణ పనులకు కదలిక తెచ్చింది. టెండర్ ప్రక్రియ నిర్వహించి, పనులు ప్రారంభించింది. ఇప్పటి వరకు షెడ్డు, చుట్టూ ప్రహరి పూర్తయింది. ఇంకా సగం పనులు చేపట్టాల్సి ఉంది. అయితే బిల్లులు రాలేదంటూ.. సదరు నిర్మాణదారుడు పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు రూ.1.10 కోట్లతో పనులు పూర్తయ్యాయి.

నిధులు విడుదల చేయాలి



పట్టణంలో నిర్మిస్తున్న గిరిజన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలి. పనులు జరుగుతున్న నేపథ్యంలో బిల్లుల రాలేదన్న కారణంతో నిర్మాణ దారుడు పనులు నిలిపి వేశారు.

– పత్యానాయక్, గిరిజన నాయకుడు, ఆమనగల్లు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



గిరిజన భవన నిర్మాణం గురించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. భవనం వినియోగంలోకి వచ్చేలా కృషి చేస్తాం. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండానే పనులకు శంకుస్థాపన చేసింది. కాంగ్రెస్ సర్కార్.. నిధులు కేటాయించి, పనులు ప్రారంభించింది.

– యాట గీత, మార్కెట్ చైర్ పర్సన్, ఆమనగల్లు